
సాక్షి
బాపట్ల
మంగళవారం । 26 । నవంబర్ । 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 585.40 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 10,000 క్యూసెక్కులు వదిలారు.



నాగాభరణం, వెండి కిరీటం బహూకరణ

మేడికొండూరు: మందపాడు చెన్నమల్లేశ్వర ఆలయానికి తుమ్మల కుమారస్వామి, ఆదిలక్ష్మి దంపతులు నాగాభరణం.. తుమ్మల సత్యనారాయణ వెండి కిరీటాన్ని బహూకరించారు.

చంద్రికకు బంగారు పతకం



మంగళగిరి: పట్టణానికి చెందిన పవర్ లిఫ్టర్ బొల్లినేని చంద్రిక బంగారు పతకం సాధించింది. ఇటీవల సేలంలో జరిగిన పోటీలలో స్క్వాట్ 250 కేజీలు, బెంచ్ ప్రెస్ 110 కేజీలు, డెడ్ లిఫ్ట్ 200 కేజీలు కలిపి మొత్తం 560 కేజీలు బరువు ఎత్తి బంగారు పతకం సాధించింది.

న్యూస్‌రీల్

సీఎం పర్యటనను విజయవంతం చేయండి

బాపట్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను జయప్రదం చేయాలని జిల్లా అధికారులకు కలెక్టర్ జె.వెంకట మురళి సూచించారు. జిల్లా అధికారులతో సోమవారం స్థానిక కలెక్టరేట్లో ఆయన సమావేశమయ్యారు. బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో డిసెంబర్ ఏడో తేదీన జరిగే విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారని కలెక్టర్ చెప్పారు. అధికారిక సమాచారం వచ్చినందున అధికారులంతా అప్రమత్తం కావాలన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులందరూ తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులు, మున్సిపల్ అధికారులపై ఉందన్నారు. ఆయా శాఖల అధికారులు చేపట్టాల్సిన పనులను వివరించారు. జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, అన్ని శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓ పి.గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా కార్తిక కోటి దీపోత్సవం



కారంచేడు: కార్తిక మాసం చివరి సోమవారం పురస్కరించుకొని ఉదయం నుంచి మండల కేంద్రమైన కారంచేడు రెండు చెరువుల మధ్య కొలువైన వైష్ణవి దుర్గామాత ఆలయంలో భక్తులు పెద్దఎత్తున ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం నుంచి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రాత్రికి గ్రామంలోని అనేకమంది మహిళలతో కలసి కోటి దీపోత్సవ కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

రేపు యూపీపీఎస్సీ ఉచిత శిక్షణ ప్రవేశ పరీక్ష

నెహ్రూనగర్: యూపీపీఎస్సీ ఉచిత శిక్షణ ప్రవేశ పరీక్షను ఈ నెల 27న గుంటూరు నగరంలోని బీసీ స్టడీ సర్కిల్(రాజాగారితోట)లో నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి మయూరి సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఒంగోలు జిల్లాలకు చెందిన అభ్యర్థులు ఉదయం 10.30గంటలకు బీసీ స్టడీ సర్కిల్‌కు వద్ద హాజరుకావాలని ఆమె సూచించారు.

నేటి నుంచి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

ఏఎన్‌యూ: దక్షిణ, పశ్చిమ మండలాల(జోన్స్) అంతర్ విశ్వవిద్యాలయాల స్త్రీ, పురుషుల వెయిట్ లిఫ్టింగ్ మంగళవారం నుంచి ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరుగుతాయని పోటీల నిర్వాహక కార్యదర్శి, ఏఎన్‌యూ వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్ తెలిపారు. పోటీలకు వివరాలను సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. మహిళల కేటగిరీ పోటీలు మంగళవారం నుంచి 28 వరకు, పురుషులకు ఈనెల 30వ తేదీ నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. పోటీల్లో 125 విశ్వవిద్యాలయాల నుంచి వెయిట్ లిఫ్టర్లు హాజరుకానున్నారని తెలిపారు. మంగళవారం జరిగే పోటీల ప్రారంభోత్సవ సభకు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని, ప్రత్యేక ఆహ్వానితులుగా అర్జున అవార్డు గ్రహీత నీలంశెట్టి లక్ష్మి, ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ బడేటి వెంకటరామయ్య, యూనివర్సిటీ అధికారులు, టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొంటారని తెలిపారు. పోటీలకు వీసీ ఆచార్య కె గంగాధరరావు ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్‌గా ఉన్నారని పాల్ కుమార్ తెలిపారు.

పవర్ లిఫ్టింగ్‌లో షబీనాకు బంగారు పతకం



తెనాలి: పట్టణానికి చెందిన పవర్ లిఫ్టర్ షేక్ షబీనా మరో విజయం సాధించింది. సదరన్ రైల్వే, సేలమ్ డివిజన్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రం సేలంలో నిర్వహించిన సౌతిండియా పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం కైవసం చేసుకుంది. ఈ పోటీల్లో 84 కిలోల విభాగంలో తలపడిన షబీనా, స్క్వాట్‌లో 190 కిలోలు, బెంచ్‌ప్రెస్‌లో 90 కిలోలు, డెడ్‌లిఫ్ట్‌లో 180 కిలోల చొప్పున మొత్తం 460 కిలోల బరువులనెత్తి, ఓవరాల్‌గా ఈ విజయాన్ని అందుకుంది.

జోరుగా జీరో దందా

పన్నులు చెల్లించకుండా గ్రానైట్ పలకలు అక్రమ రవాణా

- బల్లికురవ, సంతమాగులూరు, మార్టూరు నుంచి గ్రానైట్ పలకలు ఎగుమతి
- జీరో బిల్లులతో రోజుకు 110 లారీల తరలింపు
- లారీకి రూ.32 వేలు వసూలు చేస్తున్న పచ్చ నేతలు
- చెక్‌పోస్టు నిర్వహణ కంపెనీకి రూ.16 వేలు, దందా నిర్వాహకులకు రూ.16 వేలు
- తెర వెనుక, ముందు పచ్చనేతలు...
- నెలకు రూ.10.56 కోట్ల వసూలు
- ప్రభుత్వానికి రూ.కోట్లలో పన్ను ఎగవేత



బల్లికురవలో తరలించేందుకు లోడు చేస్తున్న గ్రానైట్ పలకలు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: అద్దంకి నియోజకవర్గంలోని బల్లికురవ, సంతమాగులూరు మండలాల నుంచి గ్రానైట్ పాలీషింగ్ పలకలు అక్రమంగా తరలిపోతున్నాయి. ప్రభుత్వానికి ఎటువంటి సేల్స్‌టాక్స్, మైనింగ్ టాక్స్ చెల్లించకుండానే జీరోలో తెలంగాణతోపాటు దేశవ్యాప్తంగా తరలిస్తున్నారు. పై రెండు మండలాల నుంచే రోజుకు 40 నుంచి 50 లారీలు తరలి పోతున్నాయి. ఓ మంత్రి ప్రధాన అనుచరుడు ఈ అక్రమ రవాణాలో కీలకపాత్ర పోషిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అక్రమరవాణాను అడ్డుకునేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం చెబుతున్నా కాంట్రాక్ట్ దక్కించుకున్న కంపెనీ మాత్రం అనధికారికంగా ఆ బాధ్యతలను పచ్చనేతల చేతుల్లో పెట్టి వాటాలు పంచుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. జీరోలో పలకలు తరలించాలనుకునే వ్యాపారుల వద్ద లారీకి రూ.32 వేలు కప్పం కట్టించుకొని చెక్ పోస్టుకంపెనీ పేరున స్లిప్పులు ఇస్తున్నట్లు సమాచారం.

జోడీ కుదిరింది.. స్పీడు పెరిగింది

కూటమి అధికారంలోకి వచ్చిన ప్రారంభం నుంచి మార్టూరుకు చెందిన వ్యాపారులు పర్చూరు నియోజకవర్గ పచ్చనేతకు కప్పం కట్టి జీరోలో గ్రానైట్ పలకలు ఇతర రాష్ట్రాలకు తరలించేవారు. మార్టూరు నుంచి రోజుకు సుమారు 70కి పైగా లారీలు ఈ తరహాలో అక్రమ రవాణా సాగించేవి. ప్రారంభంలో లారీకి రూ.28 వేలు కప్పం కట్టించుకునేవారు. ఆ తర్వాత మంత్రి నియోజకవర్గం నుంచి గ్రానైట్ పలకలు ఎగుమతి అవుతుండటంతో మంత్రి ప్రధాన అనుచరుడికి ఈ జీరో వ్యాపారంపై కన్నుపడింది. పర్చూరు పచ్చనేతతో మిలాఖత్ అయ్యారు. అప్పటికే ఈ వ్యవహారంలో ఆరితేరిన మార్టూరుకు చెందిన వ్యక్తికి దందాను అప్పగించారు. ప్రస్తుతం అద్దంకి, పర్చూరు నియోజకవర్గాలనుంచి రోజుకు 110 లారీల గ్రానైట్ పలకలు అక్రమంగా ఇతర రాష్ట్రాలు, అక్కడినుంచి ఇతర దేశాలకు తరలిస్తున్నారు.

ప్రభుత్వ రాబడికి గండి ...

అక్రమంగా గ్రానైట్ తరలిస్తుండటంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ప్రతి టన్ను పాలిషింగ్ పలకలకు సేల్స్‌టాక్స్ రూ.1300, మైనింగ్ టాక్స్ రూ.700 చొప్పున మొత్తం రూ. 2 వేలు ప్రభుత్వానికి చెల్లించాలి. ఈ లెక్కన జీరోలో వెళ్లే 35 టన్నుల లారీకి రూ.70 వేలు టాక్స్ చెల్లించాలి. రోజుకు 110 లారీలకు అనుకుంటే రూ.77 లక్షలు, ఆ ప్రకారం నెలకు రూ.23.10 కోట్లు టాక్స్‌లు చెల్లించాల్సి ఉంది. కానీ వ్యాపారులు ప్రభుత్వానికి పైసా చెల్లించకుండా అక్రమ మార్గంలో గ్రానైట్‌ను తరలిస్తున్నారు. అయినా అధికారులు తమకేమీ పట్టనట్లు మిన్నకుండి పోతున్నారు.

నెలకు రూ.కోట్లలోనే రాబడి..

ఒక్కోలారీలో 35 టన్నులకు తగ్గకుండా గ్రానైట్ పలకలను తరలిస్తారు. ఇందుకోసం దందా నిర్వాహకులు లారీకి రూ.32 వేలు వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన రోజుకు 110 లారీలకు రూ.35,20,000, నెలకు రూ.10,56,60,000 వసూలు చేస్తున్నారు. ఈ మొత్తంలో చెక్‌పోస్టుల కాంట్రాక్ట్ నిర్వాహకులకు లారీకి రూ.16 వేలు చొప్పున చెల్లించి మిగిలిన దాంట్లో చిలకలూరిపేట, నరసరావుపేట, మాచర్ల, పిడుగురాళ్ల పచ్చనేతలకు వాటాలు పంచుతున్నట్లు సమాచారం. వారితోపాటు అటు మైనింగ్, పోలీసు, విజిలెన్స్ తదితర అధికారులకు సైతం నెలకు కొంత మొత్తం చెల్లిస్తున్నట్లు వినికిడి. మిగిలిన మొత్తాన్ని పర్చూరు నేత, మంత్రి అనుచరుడు వాటాలుగా పంచుకుంటున్నట్లు సమాచారం.



లారీలలో తరలి వెళుతున్న గ్రానైట్



అర్జీలు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

- జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరణ

బాపట్ల: ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులు, సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు కలెక్టర్‌కు అర్జీల రూపంలో సమస్యలు విన్నవించారు. తన పరిధిలోని వాటికి ఆయన సత్వరమే పరిష్కార మార్గం చూపారు. మిగిలిన వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. గృహాల జియో ట్యాగింగ్ ప్రక్రియ రెండు రోజుల్లో పూర్తి చేయాలని హెచ్చరించారు. ఆయా గ్రామాలలో లక్ష్యం మేరకు రీ సర్వే పూర్తి చేయాలని ఆన్‌లైన్ ద్వారా జేసీ కలెక్టర్ ప్రఖర్ జైన్ అధికారులకు సూచించారు. అదేవిధంగా రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా అధికారులతో స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ భారత రాజ్యాంగం పీఠిక ప్రతిజ్ఞ చేయించారు. ఈనెల 26వ తేదీన రాజ్యాంగం దినోత్సవం సందర్భంగా బాపట్లలో ప్రదర్శన ఉంటుందని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, ఆర్డీఓ పి.గ్లోరియా, తదితరులు పాల్గొన్నారు.

జన గణనతో పాటు కులగణన చేపట్టాలి..

ప్రజల అభ్యున్నతితోనే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందనే విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలి. దేశవ్యాప్తంగా జన గణనతో పాటు కులగణన జరపాలి. అప్పుడే అన్నివర్గాలకు సమన్యాయం జరిగి మేలు జరుగుతుంది. దిగువ వర్గాలకు సైతం ప్రభుత్వ పథకాలు చేరగలుగుతాయి. ఈమేరకు జిల్లా కలెక్టర్ వెంకట మురళీకృష్ణను కలిసి బీసీ సంక్షేమం సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశాం.

– మద్దిబోయిన తాతయ్య, బీసీ సంక్షేమ సంఘం నేత

వరద నిధుల ఖర్చుల వివరాలు ఇవ్వడం లేదు..

విజయవాడ, బాపట్లలో ఇటీవల సంభవించిన వరదలలో ఖర్చు పెట్టిన వాటి వివరాలను కోరినప్పటికీ మున్సిపల్ అధికారులు ఇవ్వటంలేదు. 65రోజులుగా వివరాలు ఇవ్వాలని ఆర్‌టీఐ యాక్టు ద్వారా కోరినప్పటికీ సమాచారం ఇవ్వటంలేదు. వెంటనే వివరాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించాలని జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించాను.

–జోగి రాజా, బాపట్ల

పట్టాలిచ్చి నోటీసులు ఇవ్వడం విడ్డూరం

- తహసీల్దార్ కార్యాలయం ముందు సిపాయి కాలనీ గిరిజనుల ధర్నా
- మంత్రి గొట్టిపాటికి వినతిపత్రం



తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సిపాయి కాలనీ గిరిజనులు

బల్లికురవ: రెవెన్యూ అధికారులు నివేశన స్థలాలకు సంబంధించిన పట్టాలిచ్చినా.. అవి చెల్లుబాటు కావని ఓ ఎన్ఆర్ఐ కోర్టు ద్వారా నోటీసులు ఇచ్చి ఖాళీ చేయమనడం విడ్డూరంగా ఉందని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు వాపోయారు. సోమవారం ఎస్ఎల్ గుడిపాడు పంచాయతీలోని సిపాయి కాలనీ గిరిపుత్రులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ప్రభుత్వం సర్వే నంబరు 36, 37లో 35 మంది గిరిజనులకు తలా రెండున్నర సెంట్ల నివేశన స్థలం, పక్కా ఇళ్ల ప్రభుత్వం మంజూరు చేయగా ఇళ్లు నిర్మించుకుని హాయిగా జీవిస్తున్నారన్నారు. అయితే ఓ ఎన్ఆర్ఐ తాను కొనుగోలు చేసిన భూమిలో ఈ కాలనీ ఉందంటూ నోటీసులతో బెదిరిస్తున్నాడన్నారు. ఎన్ఆర్ఐ ఆగడాలకు అడ్డుకట్టవేయకపోతే తాము ఎంతటి ఆందోళకై నా సిద్ధమని వెంకటేశ్వర్లు హెచ్చరించారు.

మంత్రికి వినతి పత్రం..

బల్లికురవలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు హాజరైన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వెంకటేశ్వర్లు గిరిజనులతో కలిసి అర్జీ అందజేశారు. దీనిపై స్పందించిన మంత్రి గొట్టిపాటి తక్షణమే ఆ భూములను పరిశీలించి గిరిజనులకు న్యాయం చేయాలని, పట్టా భూమి అయితే ల్యాండ్ ఎక్విజేషన్‌తోనైనా సమస్య పరిష్కారించాలని ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడుకు సూచించారు. ఈ గ్రీవెన్స్‌లో రెవెన్యూ హౌసింగ్‌లకు సంబంధించి 52 అర్జీలు అందజేశారు. తహసీల్దార్ కవిత ఎంపీడీఓ కుసుమకుమారి, అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి



బాపట్ల కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న వలంటీర్లు

ఏపీ వలంటీర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి

బాపట్ల: రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏపీ గ్రామ,వార్డు వలంటీర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. బాపట్ల జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఆమె వలంటీర్లతో కలిసి నిరసన తెలిపారు. కె.ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని, బకాయి వేతనాలు చెల్లించాలని, రూ.10వేలు వేతనం హామీ నెరవేర్చాలని, జాబ్‌చార్ట్ ప్రకటించాలని, బలవంతంగా రాజీనామాలు చేసిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం వలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన తెలిపిన వారిలో కె.అనూష, షేక్.షహీరా, యు.శ్రీనివాసులు, ఎం.జ్యోతి తదితరులు ఉన్నారు. నిరసన అనంతరం జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళికి వినతిపత్రం అందించారు.

జగ్జీవన్‌రామ్ చైర్‌ను సందర్శించిన లిడ్‌కాప్ చైర్మన్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని బాబూ జగ్జీవన్‌రామ్ చైర్‌ను సోమవారం ఏపీ లిడ్‌కాప్ చైర్మన్ పిల్లి మాణిక్యారావు సందర్శించారు. చైర్ ఆధ్వర్యంలో చేపడుతున్న చర్యలను డైరెక్టర్ ఆచార్య పీజే రత్నాకర్ ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా మాణిక్యారావు మాట్లాడుతూ చైర్ అభివృద్ధికి లిడ్‌కాప్ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. చైర్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించాలని కోరారు. అనంతరం వీసీ కె.గంగాధరరావును మర్యాదపూర్వకంగా కలిశారు.

కూలిన సాగు ఆశలు!

- వెల్లటూరు ఛానల్ బీఎం డ్రెయిన్‌పై చప్టా కూలిన నేపథ్యంలో రబీసాగుకు ఆటంకం
- ఆందోళనలో రైతాంగం
- తాత్కాలిక మరమ్మతులు చేసి దిగువకు సాగునీరు వదులుతామంటున్న అధికారులు



చప్టా వద్ద బీఎం డ్రెయిన్‌లోకి వృథాగా పోతున్న సాగునీరు

భట్టిప్రోలు: వెల్లటూరు ఛానల్‌పై భట్టిప్రోలు సమీపంలోని కూలిపోయిన చప్టాకు తాత్కాలిక మరమ్మతులు నిర్వహించి సాగునీరు పారుదలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు ఇరిగేషన్ శాఖ సన్నాహాలు చేస్తుంది. వెల్లటూరు ఛానల్ బీఎం డ్రెయిన్‌లో చప్టా కూలిపోవడంతో ఆందోళన వ్యక్తమవుతుంది. సుమారు 30 వేల ఎకరాలకు ఈ కాల్వ ద్వారా దిగువ ప్రాంతాలకు సాగునీరు విడుదల అవుతుంది. అధికారులు మాత్రం ఎటువంటి ఆందోళన చెందాల్సిన పనిలేదని ఈ నెల రోజులపాటు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా తక్కువ మోతాదులో సాగునీరు దిగువకు విడుదల చేయనున్నట్లు సోమవారం ప్రకటించారు.

అయోమయ స్థితిలో అన్నదాతలు..

బ్రిటిష్ కాలంలో నిర్మించిన వెల్లటూరు ఛానల్ ధ్వంసం కావడంతో రైతులు అయోమయ పరిస్థితుల్లో ఉన్నారు. ఈ చప్టా వద్ద 20 ఏళ్ల క్రితం పగుళ్లు రావడంతో అధికారులు మసిపూసి మారేడుకాయ చేశారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నారు. చప్టా కూలిపోతోందనే విషయం అధికారులకు ముందే తెలుసని, తెలిసీ నిర్లక్ష్యం వహించారని రైతులు మండిపడుతున్నారు. ఇది ఇలాఉండగా చప్టా పరిస్థితిని అధికారులు, ప్రజా ప్రతినిధులు చూసి వెళుతున్నారే తమకు ఎటువంటి భరోసా కల్పించడం లేదని రైతులు వాపోతున్నారు. పంటలను కాపాడుకోవాలంటే బీఎం డ్రెయిన్ పై నుంచి 16వ కి.మీ వద్ద ఉన్న రేపల్లె మెయిన్ డ్రెయిన్ నుంచి నీటిని మోటార్ల ద్వారా 23వ కి.మీ చివర వరకు సాగునీరు అందిస్తే ఎటువంటి ఇబ్బంది ఉండదని రైతులు సూచిస్తున్నారు.

రెండు మూడు రోజుల్లో దిగువకు సాగునీరు..

ప్రస్తుతం వెల్లటూరు లాకుల వద్ద సాగునీటిని తగ్గించి చప్టా వద్ద ఓ పక్క విరిగిన ప్రాంతంలోని శిథిలాలను పొక్లెయినర్‌తో తొలగించడం జరుగుతుంది. ఇసుక మూటలను అడ్డుగా వేసి మందపాటి టార్పాలిన్ పట్టలు వేసి ఆ పట్టలు కొట్టుకుపోకుండా పటిష్ట పరచి తగు మోతాదులో దిగువకు సాగునీరు అందించేవిధంగా చర్యలు చేపట్టడం జరుగుతుంది. ఇప్పటికే చప్టా వద్దకు వెళ్లేందుకు పొక్లెయిన్‌ను సిద్ధం చేశాం. రెండు మూడు రోజుల్లో పని పూర్తి చేసి సాగునీరును దిగువకు అందించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నాం.

–వెంకటరత్నం, ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

రోడ్డెక్కితే ‘టోల్’ తీతే !

- ఉమ్మడి గుంటూరులో మొదటి దశలో మూడు రోడ్లు
- రెండో దశలో ఏడు రోడ్లు
- పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం
- అమలులోకి వస్తే ఏ ప్రధాన రోడ్డుపైకి వచ్చినా టోల్ కట్టాల్సిందే...
- రోడ్ల నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకుంటున్న ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: జిల్లాలోని రాష్ట్ర రహదారులపై ఇకపై వాహనాన్ని తీసుకెళ్తే టోల్ కట్టాల్సిందే. రాష్ట్ర రహదారుల నిర్వహణ బాధ్యత నుంచి దశలవారీగా తప్పుకోవడం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికోసం గుంటూరు జిల్లాలో మొదటి దశలో మూడు ప్రధాన రహదారులు, రెండో దశలో ఏడు ప్రధాన రహదారులను ఎంపిక చేసింది. జాతీయ రహదారులపై ఇప్పటికే టోల్ వసూలు చేస్తుండగా ప్రధానమైన రాష్ట్ర రహదారుల నుంచి కూడా చేయాలని నిర్ణయించారు. దీనివల్ల వాహనదారులపై పెనుభారం పడనుంది. గుంటూరు నుంచి తెనాలి, బాపట్ల, పర్చూరు, సత్తెనపల్లి, వినుకొండ, మాచర్ల, పిడుగురాళ్ల .. ఇలా ఎక్కడికి వెళ్లాలన్నా టోల్ కట్టాల్సిన పరిస్థితి ఏర్పడనుంది.

ఐదేళ్లకోసారి తారు లేయర్

మొదటి దశలో గుంటూరు నుంచి పర్చూరు వరకు 41.44 కిలోమీటర్లు, గుంటూరు నుంచి బాపట్ల వరకూ 51.24 కిలోమీటర్లు, మంగళగిరి–తెనాలి–నారాకోడూరు వరకూ 40.05 కిలోమీటర్లు అంటే సుమారు 132.73 కిలోమీటర్ల రహదారిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించనున్నారు. ఆయా రోడ్ల నిర్వహణను కాంట్రాక్టు సంపాదించుకున్న వ్యక్తులే చూస్తారు. గుంతలు పూడ్చడంతో పాటు ఐదేళ్లకోసారి తారు లేయర్ వేస్తారు.

- రెండోవ దశలో పర్చూరు–జాగర్లమూడి–పురిమెట్ల మధ్య 54.53 కిలోమీటర్లు, అద్దంకి–సంతమాగలూరు మధ్య 40.15 కి.మీ, మాచర్ల–కారంపూడి–వినుకొండ మధ్య 72.61 కిలోమీటర్లు, కొండ్రముట్ల–బండ్లమోటు–దుర్గి మధ్య 54 కిలోమీటర్లు, సత్తెనపల్లి–మడిపాడు మధ్య 53.9 కిలోమీటర్లు, సకిరికల్లు– గురజాల మధ్య 44.18, వినుకొండ నుంచి ప్రకాశం జిల్లా పొదిలి వరకూ 56.14 కిలోమీటర్ల మేర రహదారులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించనున్నారు.
- మొదటి రెండు దశల్లో కలిపి గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలలో 508.24 కిలోమీటర్లు ప్రైవేటు వ్యక్తులకు అప్పగించనున్నారు. ఆయా రోడ్లలో ప్రస్తుతం ఎంత ట్రాఫిక్ ఉంది.. భవిష్యత్‌లో ఎంత పెరుగుతుంది.. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు కాకుండా ఇతర వాహనాలు ఎన్ని వెళ్తాయి.. ఎంత టోల్ వసూలు అవుతుంది.. కాంట్రాక్టర్‌కు గిట్టుబాటు అవుతుందా? కాకపోతే రాష్ట్ర ప్రభుత్వం ఎంత చెల్లించాల్సి వస్తుందనే అంశాలపై ప్రాజెక్టు రిపోర్టులు తయారు చేస్తున్నారు.
- తెనాలి, బాపట్ల రూట్లలో గిట్టుబాటు అయినా పర్చూరు రూట్ గిట్టుబాటు కాదని చెబుతున్నారు.
- ట్రాఫిక్ రద్దీ తక్కువగా ఉన్న రోడ్ల నిర్వహణకు కాంట్రాక్టర్లు ముందుకు వస్తారా లేదా ? అనే అంశాలపై కూడా ఆర్ అండ్ బీ అధికారులు లెక్కలు కడుతున్నారు. ఏది ఏమైనా ప్రజల నుంచి టోల్ వసూలు చేసి వారి నడ్డి విరవడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తోంది.

క్లుప్తంగా

ఏఎన్‌యూలో 11, 12 తేదీల్లో జాతీయ సదస్సు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సు పోస్టర్‌ను సోమవారం వీసీ ఆచార్య కె. గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాలచంం తదితరులు ఆవిష్కరించారు. సదస్సు డైరెక్టర్ డాక్టర్ డి. రవిశంకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య ఎ. ప్రమీలారాణి వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది డిసెంబర్ 11, 12 తేదీలలో ' ఔషధాల ఆవిష్కరణ అభివృద్ధిలో బహుళ విభాగ పరిశోధన' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. సదస్సుకు ముఖ్య ప్రసంగీకులుగా జబల్‌పూర్ మంగళమాటన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య కేఆర్ఎస్ సాంబశివరావు హాజరు కానున్నారని పేర్కొన్నారు. మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఐ. బాలకృష్ణ, కేరళలోని త్రివేండ్రం రీజినల్ క్యాన్సర్ రీసెర్చ్ సెంటర్ నుంచి డాక్టర్ బి. చంద్రశేఖరన్, బెంగళూరులోని అల్ అమీన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ సల్లాహుద్దీన్, హైదరాబాద్ నల్ల నరసింహారెడ్డి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ డీన్ డాక్టర్ సీహెచ్. కృష్ణమోహన్ హాజరై ఉపన్యాసాలు చేస్తారని పేర్కొన్నారు. మేడికొండూరులోని కేసిరెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్ కో స్పాన్సర్‌గా ఈ సదస్సు జరుగుతుందని తెలిపారు. కన్వీనర్‌గా డాక్టర్ అన్నపూర్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ కె. సుజనా, కోశాధికారిగా డాక్టర్ కె.ఈ. ప్రవల్లిక, జాయింట్ ఆర్గనైజేషన్ సెక్రటరీగా డాక్టర్ షేక్ మస్తానమ్మ, కె. విజయ్ కిషోర్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

దేశ సైనికులకు అండగా నిలుద్దాం

సైనికుల సహాయార్థం నిధుల సేకరణ స్టిక్కర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి


స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్

బాపట్ల: సరిహద్దుల్లో ప్రాణాలకు తెగించి, దేశానికి సేవ చేస్తున్న సైనికులకు అన్నివిధాలుగా సహకరించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. సైనికుల సహాయార్థం నిధుల సేకరణలో భాగంగా రూపొందించిన స్టిక్కర్లను సోమవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ దేశ సరిహద్దులు, ప్రకృతి విపత్తులలో ప్రజలను రక్షించడానికి సైనికులు అందిస్తున్న సేవలు మరువలేనివన్నారు. దేశ రక్షణలో ప్రాణాలు విడిచిన సైనికులకు డిసెంబర్ 7వ తేదీన ఆర్మీ ఫ్లాగ్ డేలో నివాళులు అర్పిస్తూ, వారి కుటుంబాల సహాయార్థం విరాళాల సేకరణ జరుగుతుందన్నారు. నిధుల సేకరణ నిమిత్తం జిల్లా సైనిక సంక్షేమ శాఖ వారు రూపొందించిన రూ.2, రూ.5 విలువ గల ఆర్మ్‌డ్ ఫోర్స్ యంత్రాలు, చిహ్నాల స్టిక్కర్లను ఆయన విడుదల చేశారు. ప్రతి ఒక్కరూ ఆ స్టిక్కర్లు కొనుగోలు చేసి సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి గుణశీల, ఇతర అధికారులు పాల్గొన్నారు.

లింగవివక్షను వ్యతిరేకించాలి..

బాపట్ల: లింగ వివక్షను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. జాతీయ స్థాయి జెండర్ ప్రచారంలో భాగంగా రూపొందించిన వాల్‌పోస్టర్‌ను కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. మహిళలకు పని ప్రదేశాలలో రక్షణ కల్పించాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. ఈ నెల 25వ తేదీ నుంచి డిసెంబర్ 23వ తేదీ వరకు లింగ వివక్షకు వ్యతిరేకంగా ప్రచార కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. గృహహింస నిరోధక చట్టాన్ని ఉపయోగించుకొని మహిళలు రక్షణ పొందాలన్నారు. అన్ని శాఖల అధికారులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ప్రాజెక్టు డైరెక్టర్ పి.పద్మ, ఏఈ బి.శ్రీనివాసులు, జిల్లా సమైక్య ఆఫీస్ బేరర్లు, ఏపీఎంలు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించండి

సిబ్బందిని ఆదేశించిన ఏఎస్పీ టి.పి.విఠలేశ్వర్


బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఏఎస్పీ టి.పి.విఠలేశ్వర్

బాపట్లటౌన్: సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అడిషనల్ ఎస్పీ టి.పి. విఠలేశ్వర్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 33 మంది బాధితులు అడిషనల్ ఎస్పీను కలిసి సమస్యలు విన్నవించుకున్నారు. బాధితుల సమస్యలు తెలుసుకున్న ఏఎస్పీ జిల్లాలోని పోలీస్ అధికారులతో మాట్లాడి బాధితుల సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఆస్తి తగాదాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీ మోసాలు, ఇతర పలు సమస్యలతో కూడిన అర్జీలు వచ్చాయి. సమస్యలపై త్వరితగతిన విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలన్నారు.

మద్యం అక్రమంగా నిల్వ ఉంచితే చర్యలు

అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు


పాత కేసులపై పరిశీలన చేస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

చీరాల: మద్యం అక్రమంగా నిల్వ ఉంచినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఆయన చీరాల ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టేషన్ పరిధిలోని మద్యం నిల్వలు, కేసుల గురించి ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావుతో రివ్యూ సమావేశం నిర్వహించారు. మద్యం షాపులను తనిఖీ చేస్తూ మద్యం నిల్వలపై పరిశీలన చేయాలన్నారు. అలాగే అక్రమంగా మద్యం రవాణా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్సైజ్ యాక్ట్ ప్రకారం అక్రమంగా మద్యం కలిగి ఉండడం, అమ్మడం నేరమన్నారు. ఈ సందర్భంగా అధికారులుకు, సిబ్బంది సూచనలు చేశారు.

నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిలోకి దూసుకెళ్లిన బైక్

అక్కడికక్కడే వ్యక్తి మృతి


బ్రిడ్జి గోడలకు ఢీకొని మృతిచెందిన ప్రసాద్

పర్చూరు (చినగంజాం): ద్విచక్రవాహనంపై వెళ్తూ హెచ్చరిక బోర్డులు గుర్తించక నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిని ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈఘటన పర్చూరు పీఎస్ పరిధిలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పర్చూరు మండలం గణపవరం గ్రామానికి చెందిన జంపని ప్రసాద్ (38) చీరాల ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్యాకల్టీగా పనిచేస్తుంటాడు. ప్రతి రోజు చీరాల వెళ్లి వస్తుంటాడు. ఈక్రమంలో అర్ధరాత్రి సమయంలో తన ద్విచక్రవాహనంపై చీరాల నుంచి పర్చూరు రోడ్డులో వస్తున్నాడు. ఆ మార్గంలో ఎస్ఎఫ్ఎస్ పాఠశాల ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద డైవర్షన్ హెచ్చరిక బోర్డులను గుర్తించకపోవడంతో బైకు నేరుగా బ్రిడ్జిలోకి దూసుకెళ్లింది. అతని తల బ్రిడ్జి కాంక్రీట్ గోడలకు బలంగా ఢీకొనడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందారు. సోమవారం ఉదయం బ్రిడ్జి వద్ద మృతదేహం పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పర్చూరు ఎస్ఐ మాల్యాద్రి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సిబ్బంది సాయంతో బయటకు తీయించి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైతు సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి


మాట్లాడుతున్న ఆర్డీఓ రామలక్ష్మి

రేపల్లె రూరల్: ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టిందని, ఆయా కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ నేలపు రామలక్ష్మి అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డు కార్యాలయ ఆవరణలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. నిర్దేశిత ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యంను మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ రైతు సేవా కేంద్రాలకు ధాన్యం విక్రయించాలని చెప్పారు. ఈ-పంట నమోదు చేసుకుని ఈకేవైసీ పూర్తి చేసుకున్న రైతుల నుంచి మాత్రమే ధాన్యం కొనుగోలు చేస్తారన్నారు. సాధారణ రకం(కామన్) క్వింటాలుకు రూ.2300, 75 కిలోల బస్తా రూ.1725, 40 కిలోల బస్తా ధర రూ.920 మద్దతు ధర లభిస్తుందన్నారు. గ్రేడ్-ఏ రకం క్వింటాళ్లకు రూ.2320, 75 కిలోల బస్తాకు రూ.1740, 40 కిలోలకు రూ.928 ధర లభిస్తుందని చెప్పారు. పూర్తి వివరాలకు రైతుసేవా కేంద్రాలలో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్, అభ్యుదయ రైతులు, రైస్‌మిల్లర్‌లు తదితరులు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీల్లో సూరేపల్లి విద్యార్థిని ప్రతిభ


నవ్యను అభినందించి ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న గుంటూరు డీఈఓ రేణుక

భట్టిప్రోలు: భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని సోమవారం గుంటూరులోని బాలుర ఉన్నత పాఠశాలలో 6 జిల్లాల గుంటూరు జోనల్ స్థాయిలో వివిధ పోటీలు నిర్వహించారు. ఈ వక్తృత్వ పోటీలలో బాలికల విభాగంలో భట్టిప్రోలు మండలం సూరేపల్లి వీపీ అండ్ జీఎస్ఎం హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న శనగపల్లి నవ్య ప్రథమ స్థానం సాధించింది. గుంటూరు జిల్లా డీఈఓ సీవీ రేణుక ప్రతిభ చూపిన నవ్యను అభినందించి ప్రశంసా పత్రం అందజేశారు. శిక్షణ ఇచ్చిన శ్యామకుమారిని, ప్రతిభ చూపిన నవ్యను హైస్కూల్ పాలకవర్గ అధ్యక్షుడు వేపూరి చలమయ్య, కార్యదర్శి రావు వెంకట కృష్ణారావు, హెచ్ఎం కూచిభొట్ల శ్రీనివాస శర్మలు అభినందించారు.

కూటమి పాలన దుర్మార్గం

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బాబురావు


సీపీఎం మండల కార్యదర్శి ఆంజనేయులు

మేదరమెట్ల: రాష్ట్రంలో మూడు పార్టీల కూటమి పాలన దుర్మార్గంగా ఉందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎన్.బాబురావు విమర్శించారు. కొరిశపాడు మండలంలోని ప్రాసంగులపాడులో సోమవారం మూడో మండల మహాసభ కార్యక్రమం జరిగింది. ఈ సభలో కొరిశపాడులో నిర్మిస్తున్న యర్రం చినపోలిరెడ్డి ఎత్తిపోతల పథకం త్వరితగతిన పూర్తి చేసి రైతులకు నీరు అందించాలని మహాసభ తీర్మానించింది. గత ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తి చేసేందుకుగాను రూ.106 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. ఆ మొత్తాన్ని ప్రస్తుత ప్రభుత్వం రిలీజ్ చేసి పథకం పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ వ్యవసాయం పేరుతో రైతుల కడుపులు కొట్టడానికి ప్రస్తుత ప్రభుత్వం సన్నద్ధం అయ్యిందన్నారు. స్వామినాథన్ కమిటీ ప్రకారం పంటలకు మద్దతు ధర ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో భాగంగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీపీఎం మండల కార్యదర్శిగా మోంద్రు ఆంజనేయులు, వీరితో పాటు నలుగురు మండల సభ్యులను ఎన్నుకున్నారు. సీపీఎం మండల నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ కార్యవర్గంలో ఇంకొల్లు ఉపాధ్యాయులు


యు.చెంచయ్య


విజయలక్ష్మి


హనుమంతరావు

ఇంకొల్లు (చినగంజాం): యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులుగా ఇంకొల్లు మండలంలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు పి.సత్యనారాయణ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24వ తేదీ జిల్లా కేంద్రం బాపట్లలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు నిర్వహించారు. ఈసందర్భంగా యు.చెంచయ్య (జిలా కార్యదర్శి), వి.విజయలక్ష్మి (జిల్లా మహిళా కార్యదర్శి), సీహెచ్ హనుమంతరావు (జిల్లా అకడమిక్ సెల్ కన్వీనర్)గా ఎంపికయ్యారని ఆయన చెప్పారు.

అన్నదానం అభినందనీయం


అఖండ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సూర్యలంకలో అన్నదానం చేస్తున్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

బాపట్ల: సూర్యలంక సముద్రతీరానికి పుణ్య స్నానాలు చేసేందుకు వచ్చిన భక్తులకు అన్నదానం చేయటం అభినందనీయమని బాపట్ల జిల్లా అడిషనల్ ఎస్పీ పి.విఠలేశ్వర్ చెప్పారు. బాపట్ల అఖండ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విన్నకోట సురేష్ సూర్యలంక తీరంలో సోమవారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని అడిషనల్ ఎస్పీ పి.విఠలేశ్వర్ సందర్శించి భక్తులకు భోజనం వడ్డించారు. ఆయన మాట్లాడుతూ పవిత్ర కార్తికమాసంలో పుణ్యస్నానాలు చేసేందుకు సముద్రతీరానికి వచ్చిన భక్తుల ఆకలి తీర్చటం పుణ్య కార్యమని కొనియాడారు. అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ మాట్లాడుతూ శివపార్వతుల అనుగ్రహంతో గత మూడు సంవత్సరాలుగా సముద్రతీరంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ప్రస్తుతం 5వేల మందికి అన్నదానం చేశామని తెలిపారు. ఫౌండేషన్ సెటిలర్ కల్లం హరనాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వంగపాటి శివ, ఆడిటర్ సుబ్రమణ్యం, ఉపాధ్యక్షులు మామిడి రమేష్, చేజర్ల సతీష్, శ్యామ్ ప్రసాద్, నాగరాజు, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చర్చి విషయమై వ్యక్తిపై దాడి

ఏకపక్షకంగా వ్యవహరిస్తోన్న సీఐ


గాయపడిన తాళ్లూరి అమరేష్

మార్టూరు: ప్రార్థనా మందిరం విషయమై ఓ ప్రైవేటు ఉపాధ్యాయుడిపై కొందరు వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటన మండలంలోని కోనంకి ఎస్సీ కాలనీలో సోమవారం రాత్రి జరిగింది. ఏఎస్సై మహబూబ్ బాషా వివరాల మేరకు.. కోనంకి ఎస్సీ కాలనీలోని తెలుగు బాప్టిస్ట్ చర్చి విషయమై ఆరేళ్లుగా అధికార, ప్రతిపక్ష పార్టీ వర్గాల మధ్య వివాదం నడుస్తోంది. ఇరువర్గాల మధ్య సమన్వయం కుదరకపోవడంతో ఐదేళ్ల నుంచి చర్చిని మూసి ఉంచారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెవెన్యూ, పోలీసు అధికారులు అధికార పార్టీ వర్గానికి అనుమతులు ఇస్తూ చర్చి తాళాలు ఇచ్చారనేది రెండో వర్గం ఆరోపణ. చర్చిలోకి ప్రార్థనల నిమిత్తం తమను కూడా అనుమతించాలంటూ తాళ్లూరి అమరేష్ అనే ఓ ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడు పోరాటం చేస్తున్నాడు. అందులో భాగంగా సీఐ ఎం శేషగిరిరావు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు అంటూ తమకు న్యాయం జరగడం లేదని జిల్లా ఎస్పీకి గ్రీవెన్స్ సెల్‌లో సైతం అమరేష్ ఫిర్యాదు చేశారు. అయినా ఫలితం కనిపించకపోవడంతో అమరేష్ నవంబర్ మొదటి వారంలో తమను మందిరంలోకి ప్రార్థనలకు రాకుండా 11 మంది వ్యక్తులు అడ్డుకుంటున్నారంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో సెమీ క్రిస్మస్ వేడుకల గురించి చర్చించుకుంటున్న తాళ్లూరి అమరేష్‌పై కొందరు వ్యక్తులు సోమవారం రాత్రి దాడి చేయగా ఇరువర్గాలు గుమిగూడి ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. సమాచారం అందుకున్న సీఐ తమ సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకొని ఇరు వర్గాలను చెదరగొట్టారు. దాడిలో ఎడమ కంటికి స్వల్ప గాయమై కనిపించని గాయాలతో ఉన్న అమరేష్ మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముందు జాగ్రత్త చర్యగా ఎస్సీ కాలనీలో పోలీసు పికెట్ ఏర్పాటు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగంతో మానవాళికి పెనుముప్పు

- గుంటూరు డీవైఈఓ పి.వెంకటేశ్వరరావు
- ఆకట్టుకున్న పర్యావరణ సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శన


విజేతలుగా నిలిచిన విద్యార్థులతో డీవైఈఓ వెంకటేశ్వరరావు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి పెనుముప్పుగా పరిణమించి, మానవాళి మనుగడకు సవాల్‌గా మారిందని గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్షా భవన్‌లో సోమవారం ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్-విద్యాశాఖ సంయుక్తంగా జిల్లా స్థాయి పర్యావరణ సైన్స్ కాంగ్రెస్-2024 నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ''చెత్త వ్యర్థాల నుంచి సంపద సృష్టించడం'' అనే అంశంపై వివిధ నమూనా ప్రాజెక్టులను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీవైఈవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. ప్లాస్టిక్ సంచులకు బదులుగా నార, వస్త్రంతో తయారు చేసిన సంచులను ఉపయోగించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ప్రదర్శనలో విద్యార్థులు వివిధ రకాల మోడల్ నమూనాలను తయారుచేసి ప్రదర్శించారు. పర్యావరణ కాలుష్యం-తగ్గించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు అనే అంశంపై విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 94 పాఠశాలల నుంచి 225 మంది పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్ మీరా, ఎంఈవోలు బీవీ రమణయ్య, జ్యోతి కిరణ్, నాగేంద్రమ్మ డీసీఈబీ కార్యదర్శి ఏ.తిరుమలేష్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, హెచ్ఎంలు జిలానీ బాషా, వసుంధర, మణికుమార్, శ్రీనివాసరావు, రీసోర్స్ పర్సన్లు ఆయేషా సుల్తానా, శివశంకర్, అప్పారావు, శాంతిప్రియ, గంగాధర్, శ్రీనివాసరావు, గైడ్ టీచర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్‌లో కొలకలూరు జెడ్పీ హైస్కూల్, చిత్రలేఖనంలో మేడికొండూరు జెడ్పీ హైస్కూల్ ప్రథమ బహుమతి, కాకుమాను జెడ్పీ హైస్కూల్, గుంటూరు చౌత్రాలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ద్వితీయ బహుమతి, దుగ్గిరాల జెడ్పీ హైస్కూల్, ఎస్‌కేబీఎం నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన తెలంగాణ రైతులు

చేబ్రోలు: మండలంలోని వడ్లమూడిలో సాగులో ఉన్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ, వరంగల్ జిల్లాలకు చెందిన రైతులు సోమవారం సందర్శించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నాణ్యమైన పంటలు పండించి విజయాలను సాధిస్తున్న స్థానిక రైతులను కలిశారు. సాగు వివరాలు, దిగుబడి, పంట నాణ్యత గురించి తెలుసుకున్నారు. వడ్లమూడి రైతులు సూర్యదేవర ఉమామహేశ్వరరావు, పాటిబండ్ల శ్రీధర్ సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో వరి పంటలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వరి పండించడం వల్ల వేరు వ్యవస్థ దృఢంగా ఉంటుందని, దిగుబడి కూడా బాగుంటుందని రైతులు వివరించారు. వరి ఒకటే కాకుండా, గట్ల మీద రకరకాల కూరగాయలు పండించుకొని తినడం ద్వారా వారి ఆరోగ్యంతో పాటు కొంత ఆదాయం కూడా వస్తుందని తెలంగాణ రైతులకు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను అనుసరిస్తామని తెలంగాణ రైతులు తెలిపారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జిలు అభిలాష్, అనూష, మైలా వెంకటరామరాజు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

త్రివర్ణ నక్షత్రం

జాతీయ జెండా రంగుల్లో ఆకర్షణీయంగా క్రిస్మస్ స్టార్


కొల్లూరు సంజీవ్ నగర్ కాలనీ వద్ద జాతీయ జెండా రంగుల్లో క్రిస్మస్ స్టార్

క్రిస్మస్ మాసం ఆరంభం కావడంతో గ్రామాల్లో క్రిస్మస్ స్టార్ల కోలాహలం ప్రారంభమైంది. క్రిస్మస్ పర్వదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం అర్ధరాత్రి నుంచి క్రైస్తవులు పలు ఆకృతులలో కళాత్మకంగా క్రిస్మస్ స్టార్లను ఏర్పాటు చేస్తున్నారు. కొల్లూరు ఎస్సీ ప్రాంతంలోని సంజీవ్ నగర్ కాలనీ రక్షణ సైన్యం ప్రార్థన మందిరం వద్ద ఏర్పాటు చేసిన క్రిస్మస్ స్టార్ పలువురిని ఆకట్టుకుంటుంది. దేశభక్తి, మత విశ్వాసాలకు ప్రతీకగా జాతీయ జెండా రంగులతో ఏర్పాటు చేసిన క్రిస్మస్ స్టార్‌ను చూసి పలువురు ముగ్ధులవుతున్నారు. – కొల్లూరు